# ఈ కథకు ఇదే ముగింపు!

పైడిపాల

దొరబాబు—

పేరుకే కాదు—

హుందాకీ - అందానికీ

ఆస్తికీ - అంతస్థుకీ

భాషకీ - వేషానికీ కూడా !

దొరబాబు రాజారావు గారి సుపుత్రుడు. పట్నంలో చదువుకుంటున్నాడు. సెలవలకని వచ్చాడు. తండ్రి ఆరోగ్యం బావుండలేదు. అంచేత పొలం పనులు చూసే బాధ్యత ఈసారి తను తీసుకున్నాడు. ఆతను గట్టు మీద నిల్చుంటే చాలు - సర్వం చక్కబెట్టుకుపోయే ఉద్ధారకుడు సుబ్బడున్నాడు. కోత చక చకా సాగుతోంది. ఆడా మగా కలిసి ముప్పై మందున్నారు. అలసట మర్చిపోడానికి పాటందుకున్నారు.

"కందిరీగ నడుము దానా
కంది పువ్వు సాయ దానా
సందెయేళ కలుసుకోనా ?—"

అంతా వంత పాడుతున్నారు గాని ఆ పిల్ల మాత్రం పాడ్డం లేదు.

దొరబాబు వచ్చినప్పటి నుంచి చూస్తున్నాడు-

ఆ పిల్ల అరవిరిసిన అడవి మల్లెలా వుంది.

రస హృదయుడైన శిల్పి తీర్చి దిద్దిన బొమ్మలా వుంది.

అప్పుడే తొలకరించిన ప్రకృతిలా వుంది.

ఎవరో— ఎవరో తెలుసుకోవాలనే ఉబలాటం.

వచ్చీ రాగానే అడిగితే లోకువ అవుతాననే భయం దొరబాబు నోటిని కట్టేసింది. ఆ పిల్ల వరికోతలో చెయ్యి తిరిగింది మాత్రం కాదు. చూపుతో గుండెను కోసేస్తోంది. వంగి కోస్తున్నప్పటి వంపులు సొంపులు అతని కళ్ళను కలవర పెడుతున్నాయి. పది నిముషాలు ఓపిక పట్టాడు. ఆ పిల్ల పలుకు బంగారమయింది.

"ఏం సుబ్బడూ - ఈ కొత్త పిల్లకు పాటలు రావా?" దొరబాబు ధైర్యం చేసి కదలేడు,

"సదూకొంది బాబూ. ఈ పని పాటలు సరిగా అబ్బలేదు"

"పోనీ వచ్చిన సినిమా పాటలు పాడొచ్చుగా!" కవ్వించాడు దొరబాబు.

"సినిమా పాటలు పాడుద్ది బాబూ- పక్కన మీలాంటి ఈరో వుంటే" సత్తెమ్మ మోటు హాస్యమాడింది, దొరబాబు ఆ పిల్ల మీద మోజు పడుతున్నాడని పసికట్టి.

"ఛీ! పో. ఇలాంటి మాటలంటే నేను పన్లోకి రాను" ఆ పిల్లను సిగ్గు, కోపం- రెండూ ఆవహించాయి.

అప్పుడింక సంభాషణ పొడిగించటం మంచిదికాదనుకున్నాడు దొరబాబు.

"తెల్చి కోసెయ్యకండి. కిందికి కొయ్యండెహే" సుబ్బడు జనాన్ని హెచ్చరించాడు.

"నల్ల నల్లని మబ్బులోన లగ్గో పిల్లా
తెల్ల తెల్లని సందమామ లగ్గో పిల్లా..."

ఈసారి సత్తెమ్మ పాట మొదలు పెట్టింది, మిగతా వాళ్ళు శ్రుతి కలిపారు. పాట హుషారెక్కే కొద్దీ ఒళ్ళు మరచి పన్జేస్తున్నారు జనం.

మధ్యాహ్నం భోజనాలకి లేచినప్పుడు దొరబాబు తనకి యింటి నుంచి వచ్చిన టిఫినూ- కాఫీ మిగిల్చి సత్తెమ్మ చేతికిచ్చాడు— ఆ చదువుకున్న పిల్లకి పెట్టమని. కాని ఆ పిల్ల కక్కుర్తి పడలేదు. అవి సత్తెమ్మకే దక్కాయి. సత్తెమ్మకి దొరబాబు చేష్టలర్థమయ్యాయి. సాయంత్రం వెళ్ళిపోయే ముందు దొరబాబుతో



గుసగుసలాడింది.

"ఆ పిల్ల నా మేనగోళ్ళే. తమరు మనసు పడితే మచ్చిక సేత్తాను" అని. దొరబాబు మొదట నీళ్ల నమిలినా తర్వాత నోరు చప్పరించాడు, సత్తెమ్మ యిలాంటి "పుణ్య కార్యాలు" చెయ్యడానికి అలవాటుపడి పోయింది.

ఆ పిల్ల వివరాలు కనుక్కున్నాడు దొర బాబు.

పిల్ల పేరు శకుంతల.

శకుంతల తల్లినో పెదకాపు వుంచు కున్నాడు.

శకుంతల తండ్రి రిక్షా తొక్కే నాగరాజు.

తల్లి శకుంతల చిన్నప్పుడే చచ్చిపోయింది.

సత్తెమ్మ యింట్లోనే ఆ పిల్ల పెరిగి పెద్ద దయింది.

యింత వరకు ఏ తుమ్మెదకూ చిక్కని పువ్వు.

దొరబాబు ఆ రోజు సత్తెమ్మకి పది రూపాయలు అదనంగా ముట్టజెప్పాడు.

ం ం ం ం

ఎండ అధి 'కారం' లా వుంది.

కళ్ళం ఎదురుగా కుర్చీ వేసుకుని కూర్చున్న దొరబాబు మకుటం లేని యువ రాజులా వున్నాడు.

కళ్ళంలో వరిమోపులు తెచ్చి వేస్తున్నారు, కుప్ప శ్రీమంతుడి భవనంలా చకచకా లేస్తోంది.

వాళ్ళలో మగాళ్ళ కంటె నేర్పుగా నిచ్చెన మీదుగా కుప్ప ఎక్కుతున్న ఆడవాళ్ళు వున్నారు, కాని ఆ పిల్ల యింత వరకూ మోపెత్తుకుని రాలేదు.

శకుంతల మోపు మొయ్యకపోతే పనికి నష్టంరాదు. కాని ఆ భంగిమలో శకుంతల "కుచంబులున్,తురుములే నడుమల్లలనాడ.." నడిచిన వరూధినిలా ఉంటదూ?— అప్పుడు ఆ అందాలు చూడాలని దొరబాబు కోరిక.

కట్టేత జరుగుచున్న చోటికి పర్యవేక్షణకు వెళ్ళాడు. శకుంతల వరిమోపుల్ని మిగతా వాళ్ళకు ఎత్తుతోంది.

ఎవరూ లేని సమయం చూసి దొరబాబు అడిగాడు-

"నువ్వు మొయ్యలేవా ?"

"మరి మీ రెత్తుతారా ?" ఆ పిల్ల బుగ్గల్లో ముద్దమందారాలు విరబూసాయి.

"ఎత్తనా?-కానియ్. పని తొందరగా జరుగు తుంది" అతగాడి కొంటె చూపుల్లో కోటితుమ్మె నెల ఝుంకార ముంది. శకుంతల చీర చెంగు నెత్తి మీదకులాక్కొని మోపెత్తుకొంది. "కచ్చా" పోసుకొని నడుస్తున్న శకుంతల ప్రబంధ సుందరిలా వుంది, ఆమె పిక్కల సొగసుఅతని కళ్ళను కవ్విస్తోంది. అతి కష్టం మీద కుప్ప వరకు వెళ్ళింది. అక్కడ మరొకరందుకొని కుప్పమీదకి మోసు కెళ్ళారు.

ఆ తర్వాత వచ్చిన వాళ్ళందరికీ మోపు లెత్తడం దొరబాబు వంతయింది. అలవాటులేక పోయినా శకుంతలకోసం కష్టపడుతున్నాడు. కుప్ప ఎక్కడం చేతకాక మధ్యలో మోపు ఎవరో ఒకళ్ళకి ఎత్తి వచ్చేస్తోంది గనుక శకుం తల అందరికంటెఎక్కువ సార్లు మోపులకోసం వస్తోంది.

దొరబాబు అవకాశం వచ్చినపుడల్లా ఆమె కళ్ళలోకి చూస్తున్నాడు. గుండెల వంకగుచ్చి గుచ్చి చూస్తున్నాడు. వేళ్ళు తాకాడు. శకుం తల మాట్లాడలేదు. తర్వాత ధైర్యం చేసిమోపు ఎత్తుతూ చెయ్యి నిమిరాడు.

"ఏమిటీ సరసం!" మృదువుగానే విడిపించు కొని వెళ్ళిపోయింది.

"ఫర్వాలేదు. పిట్టలైనులో వుంది" అను కొన్నాడు దొరబాబు. ఓ గంట గడిచింది. దొరబాబు ముంజేతులు గీరుకు పోయాయి. అతగాడి అవస్థ గమనించింది సత్తెమ్మ.


"మీకెందు కొచ్చిన సెమబాబూ?"

"పిల్లకి పని నేర్పు తున్నాను"

"ఆ !_గొప్పపనోడే చూతత్తా, గింజలన్నీ నేల పాలవుతున్నాయి" చెమటలు కక్కుతూ,







వస్తున్న శకుంతల అందుకొంది.

"మొయ్యడం చేత గాక పోతేసరి"

"...పడి ఆ పని కూడా చేసేరు గనుక. ...రగారు హాస్పటల్ కి" చిలిపిగా ... శకుంతల.

"...తుంది – ...కాదు, పని అవుతుంది" అంటూ వేగంగా వచ్చిన సుబ్బుడు దొరబాబుని చూసి "సినబాబూ- ఆ పిల్ల యెత్తుతుంది, మీరెళ్ళి నీడని కూర్చోండి" అన్నాడు చనువుగా.

"అవున్రా, కూలి నష్టమయినా ఫర్వా లేదు గాని, గింజలు నష్టమయితే కష్టం" నవ్వుతూ గద్దెక్కాడు దొరబాబు.

నిజానికి దొరబాబుకి మోపు లెత్తడం చేత కాదు. శకుంతలకి మొయ్యడం చేతకాదు. గింజలు రాలిపోతున్నాయి. కాని ఆ మాటనే ధైర్యం ఎవరికీ లేదు. ఆ మాటనకుండానే సమస్యని తేలికగా పరిష్కరించాడు సుబ్బుడు.

మధ్యాహ్నం అందరూ చెట్టునీడని భోం చేస్తుంటే కాఫీలని సత్తెమ్మ దొరబాబు కూర్చున్న మోటార్ షెడ్ దగ్గరికి_శకుం తలతో చేరింది.

సత్తెమ్మా, ఈ పిల్ల చనువుకుందన్నావు కదా- ఏదీ ఈ అక్షరాలు చదవమను" అంటూ అదను చూసుకొని సిగరెట్టు పెట్టె నాలిక మీద బాల్ పాయింట్ పెన్ తో రాసిచ్చాడు.

"ఐ లవ్ యు"అని నాలుక కరుచుకుంది శకుంతల.

"అంటే అర్థం చెప్పు చూద్దాం" దొరబాబు సవాల్.

"ఛీ! నేను చెప్పను"

"సెప్పవే. మన సినబాబు దగ్గర సిగ్గేటి?"

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను"

"చూశావా, సత్తెమ్మా! మీ పిల్ల ఏమం టుందో?_ నువ్వేమో నోట్లో వేలు పెట్టినా..." దొరబాబు మాటలు పూర్తి కాకుండానే సిగ్గుతో సీతాకోక చిలుకలా అక్కణ్ణుంచి తుర్రుమంది శకుంతల!

ం ం ం ం

గుడిలో దేవుళ్లుంటారు.

చెరలో ముద్దాయిలుంటారు.

కాని ఆ గుడిలో ముద్దాయిల నుంచడం రివాజు,

గొంతాలమ్మ గుళ్ళో దొరబాబూ. శకుం

తలా—

గుడికి తాళం వేశారు-తాళాల చెవులు గుడి పెద్దల చేతుల్లో వున్నాయి. దొరబాబు, శకుంతలా తప్పు చేస్తుండగా పట్టుబడ్డారు. గూడెం పెద్దలు సమావేశమై తీర్పుచెప్పారు. ముద్దాయిలకు "తప్పు" వేస్తారు. అంతవరకు వాళ్ళు గుళ్లో ఉండాల్సిందే.

ఈ వార్త ఊరంతా చిచ్చులా పాకింది. రాజారావుగారి చెవిన్ని కూడా పడింది. కాని ఎంత డబ్బు పలుకుబడి వున్నా ఇలాంటి విషయాల్లో గూడెం పెద్దల్ని కాదన లేడు.

ఆసక్తివున్న జనం గుడి దగ్గర కొచ్చిఊచల్లోంచి ఆ జంటనుచూస్తున్నారు. గుమిగూడిన జనంతో గుడి దగ్గర తిరునాళ్ళలా వుంది.

రాజారావుకి "ప్రిస్టేజి" అడ్డం వచ్చి అక్కడికి రాలేదు. అతగాడి బంధువులు మాత్రం వచ్చి కులపెద్దల్ని ప్రలోభపెడుతున్నారు.

సాధారణంగా ఇలాంటి తప్పు జరిగినప్పుడు అబ్బాయి కిష్టమైతే ఆ కులంలో చేరి ఆమ్మాయిని పెళ్ళాడొచ్చు. లేదా అమ్మాయి తప్పు చెల్లించి కులాన్ని విడిచిపెట్టేసి వెళ్లి అబ్బాయిని పెళ్ళి చేసుకోవచ్చు. లేదా మరో అవకాశం కూడా వుంది. అబ్బాయి కులంపెద్దలు విధించిన జుర్మానా చెల్లించేసి ఈ (నిర్) బంధంనుంచి బయటపడొచ్చు. అతడు కట్టిన జుర్మానా సంఘానికే దక్కుతుందిగాని ఆ అమ్మాయికి పైసాకూడా రాదు. ఈ అవకాశాన్ని వినియోగించుకోమని దొరబాబుని ఆత్మీయులు వత్తిడి చేస్తున్నారు. కులం పెద్దలు పెళ్ళిచేసుకోవడమో, తప్పుకట్టడమో తేల్చుకోమని దొరబాబుని అడిగాడు.

శకుంతల దొరబాబు వాగ్దానాన్ని నిలబెట్టుకోమని ప్రాధేయపడింది.

మొదట్లో సత్తెమ్మ ఎంత ప్రోత్సహించినా దొరబాబు ఎన్ని ఎరలు చూపించినా శకుంతల దొరబాబుకి లొంగలేదు. చివరకు శకుంతల లేనిదే బ్రతకలేననీ, ఆమెను పెళ్లి చేసుకుంటాననీ ఒట్టు వేశాడు. శకుంతల అతని మాటలకు మైనంలా కరిగిపోయింది. కొన్నాళ్ల మైకం తప్ప ఈ లోకం వాళ్ళకి తెలియలేదు. పొలంలో వున్న "పాయింట్ షెడ్" ప్రేమకుటీరమైపోయింది. కథ కంచె దాటింది. గుట్టు రట్టయింది. శకుంతలచేత తిరస్కరింపబడ్డ గూడెంలో మగాళ్లు వలలేసి జంటగువ్వలను పట్టుకున్నారు.

దొరబాబు శకుంతల కన్నీళ్లు తుడిచాడు. చెవిలో గుసగుసలాడాడు. ఫలితంగా దొరబాబు కులం పెద్దలు విధించిన వెయ్యిరూపాయలు జుర్మానా ఆనందంగా చెల్లించి విడుదలై పోయాడు. కులం పెద్దలు రెండు కడవల కల్లుతో విందు చేసుకున్నారు. డబ్బుతో పాపం పరిహారమై పోయింది.

నెలలు గడిచాయి. శకుంతల ఎదురు చూస్తోంది-దొరబాబు రాకకోసం. దొరబాబు రాలేదు. "బాబు" మాత్రం రాబోతున్నాడు.

శకుంతల చెవుల్లో దొరబాబు గుసగుసలు వినిపిస్తున్నాయి—కోనసీమ కాలువ రా కు ల సవ్వడిలా....

"పిచ్చిదానా, నిన్ను విడిచిపెట్టి నేను ఉండగలనా?-ఇప్పుడే పెళ్ళంటే గుండెజబ్బుతో వున్న నాన్న "హరీ" అంటాడు. ఆ నింద ఇద్దరిమీద పడుతుంది. అంచేత ప్రస్తుతానికి తప్పుకట్టి బయటపడదాం. ఆనక ఉద్యోగం రాగానే నిన్ను తీసుకెళ్లి పెళ్లి చేసుకుంటాను. నన్ను నమ్మవూ?"

రెండోసారి అతని మాటల్ని నమ్మింది, ఇంకా నమ్ముతోంది—ఎదురు చూస్తోంది.


దొరబాబు జాడా, జాబూ లేదు—

శకుంతల మగశిశువును ప్రసవించింది.

దొరబాబు వచ్చి చూస్తాడని, తనని బిడ్డని తీసుకెళ్తాడనీ శకుంతల కళ్ళలో గంపెడాశ.

ఆ కులంలో మారుమనువు చేసుకోవడం తప్పుకాదుగనుక వేరే సంబంధం చేసుకోమని శకుంతలకి కావాల్సినవాళ్ళు సలహా ఇస్తున్నారు.

కుర్రాడున్నా తమకభ్యంతరం లేదని శకుంతల కావాల్సిన వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు.




మరో బంగారు పిచికని చూసి పెడతానని సత్తెమ్మ పోరుతోంది జోరీగలా

శకుంతల ఎవరి మాటా వినడం లేదు. తన తనువు, మనసూ దొరబాబుకే అంకితం. అవి మరొకరికి అర్పించలేదు!

ఇంతలో శకుంతలకో వార్త తెలిసింది, దొరబాబు పట్నంలో ఆఫీసరు ఉద్యోగం చేస్తున్నాడని. అతని అడ్రసు సంపాదించి పసికందుని ముస్తాబు చేసి ఆనందంగా అక్కడికి ప్రయాణమయింది-సాగరాన్ని కలవడానికి ఉరకలేస్తున్న నదిలా....

వెళ్ళిన రెండు మూడు రోజులకి "దొరగారి" దర్శనమయింది. భార్యతో కారుమీద షికారెళ్ళడానికి సిద్ధంగా వున్న దొరబాబు శకుంతలని చూసి చీదరించుకున్నాడు. "మా పొలంలో పన్చేసే పిల్ల "అనిభార్యచేత రెండ్రూపాయలు "ముష్టి" వేయించాడు, కారు ముందుకు దూసుకుపోయింది. శకుంతల ప్రాణ్పడి పోయింది.

శకుంతల అప్పటికి అర్థం చేసుకొంది-తను గుర్తింపులేని ఊటపాయననీ, ఆకలి తీరాకా విసిరేసిన ఎంగిలి విస్తరాకుననీ- భద్రంగా దాచుకొనే వెండి కంచాన్ని కాదనీ!

పౌరాణిక కాలంలో శకుంతల భరతుడితో సహా దుష్యంతుడి దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకొంటే! ఏనెట, నీవెట, సుతుడెట...?" అని అబద్ధం ఆడేశాడా మహారాజు. ఇప్పుడా మాట కూడా అనే తీరిక లేదీ మగమహారాజుకి. ఆ కాలంలోలా ఇప్పుడే ఆకాశవాణీ తనను ఆదుకోదు. ఆకాశవాణిని అడ్డం పెట్టి వ్యాసుడు శకుంతల కథని సుఖాంతం చేసి వుండకపోతే తనీ అపరదుష్యంతుడి మాయ మాటల్లో పడి వుండేది కాదేమో! కనీసం తన కథయినా తర్వాత వాళ్ళకి గుణపాఠం కావాలి.

ఇప్పుడెక్కడికి వెళ్ళాలి?-గూడానికి వెళ్ళి ఆ అవహేళనని భరించ గలదా? మరేం చెయ్యాలి? ఏది గమ్యం? ఎవరుదిక్కు? గమ్యంతెలీనిపాదాలు కదులుతున్నాయి.

మరో మూడ్రోజులకి శకుంతల అందరికీ కనిపించింది—

ఉబ్బి పోయిన శరీరంతో-

జలచరాలు పీక్కుతిన్న గాయాలతో-

భరించరాని దుర్గంధంతో-

ఉరితీయబడిన అందంలా—

మోసగించబడిన మానవతలా—

ఊరి పెద్ద కాలవలో తేలుతూ తేలుతూ...!

○ ○ ○ ○

కథ చదవటం పూర్తి కాగానే మిత్రుడు శాస్త్రి రెండు ఆరోపణలు చేశాడు- శాస్త్రి ఈ కథకి ప్రథమ శ్రోత.

ఒకటి పెద్దలు అలా జుర్మానా తీసుకొని దొరబాబుని విడిచిపెట్టెయ్యటం సబబుగా లేదని. రెండు-శకుంతల ఆత్మహత్య చేసుకోనటం (?) పిరికితనమనీ. అందువల్ల ముగింపు ఆశావహంగా లేదట !

చిత్తు ప్రతే కదా - కథ రెండో సగం చింపి పడేశాను.

○ ○ ○ ○

సాధారణంగా ఇలాంటి తప్పు జరిగినప్పుడు అబ్బాయి కిష్టమైతే ఆ కులంలో చేరి అమ్మాయిని పెళ్ళాడొచ్చు! లేదా ఆ అమ్మాయి తప్పు చెల్లించి కులాన్ని విడిచి పెట్టేసి ఆ అబ్బాయిని పెళ్లి చేసుకోవచ్చు. అంతేకాని ఇంతకు ముందులా "తప్పు"కి కేవలం జుల్మానా కడితే విడిచి పెట్టే పద్ధతి లేదని స్పష్టం చేశారు కులం పెద్దలు.

వాళ్లిచ్చిన "ఛాయిస్" లో పెద్దగా ఆలోచించవలసింది, బుర్ర బద్దలు చేసుకోవలసిందీ ఏం కనిపించలేదు దొరబాబుకి. అమ్మాయిని తనతో తీసుకెళ్లి పెళ్లి చేసుకోవడానికి అంగీకరించాడు. అయితే వివాహ పద్ధతిమాత్రం తన నిర్ణయానికి విడిచిపెట్టాలని షరత్తు పెట్టాడు, పెద్దలు అతని మాటల కొడబడి శకుంతల తప్పు చేసినందుకు అయిదొందల జుల్మానా, రెండు కడవల కల్లు ఆమె కాబోయే భర్త దొరబాబు నుంచి స్వీకరించారు. ప్రేమికుల జంట గుడి నుంచి విడుదలయ్యారు. అయితే ఆ క్షణం నుంచి శకుంతల గూడెంలో వుండడానికి వీల్లేదు. ఆమెను కులం నుంచి బహిష్కరించారు. దొరబాబు శకుంతలని పొలంలోని "ప్రేమ కుటీరం" లో వుంచి పోషిస్తున్నాడు.

ఆమె అతని జీవితంలో అడుగు పెట్టిన వేళా విశేషమో - ఏమో తెలియదు కాని దొరబాబుకి పట్నంలో ఆఫీసరు ఉద్యోగమొచ్చింది. తన వశమయ్యే ముందు తను వాగ్దానం చేసిన ప్రకారం శకుంతలని రిజిష్టర్ మారేజ్ చేసుకుని పట్నంలో కాపురం పెట్టాడు.

తననెంతో ప్రేమగా చూసుకొంటున్నాడని, తన కాపురం స్వర్గంలా వుందని శకుంతల అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తోంది. అయిదారు నెలలు గడిచాయి. శకుంతలకి నెలతప్పింది.


వచ్చే సంచిక

నవలానుబంధంలో

"కాశీయాత్ర"

చెల్లూరి సీతారాజేశ్వరరావు రచన చదవండి:





ఈ సంతోషకరమైన వార్త తెలియగానే శకుంతల కిష్టమైన పిండివంటలు చేసింది సత్తెమ్మ, అవి తీసుకొని సత్తెమ్మ, నాగరాజు శకుంతలని చూడ్డానికి సంబరంగా పట్నం బయల్దేరారు. వాళ్ళు వెళ్లి తలుపు తోసేసరికి దొరబాబు, నలుగురైదుగురు స్నేహితులు దీనంగా కూర్చొని వున్నారు.

పక్కన శకుంతల -

కాలిపోయిన శరీరంతో -

వికృతంగా వున్న బొబ్బలతో. గాయాలలో

దుర్భరమైన కమురు కంపుతో...!

దొరబాబు మొహంలో నెత్తురు లేదు. 'రండి.... సమయానికి వచ్చారు, నా 'శకు' నన్ను ఒంటరిని చేసి వెళ్లి పోయింది.... ఇంక మాటలు పెగలడం లేదు,

సత్తెమ్మ శకుంతల శవం మీదపడి బావురుమంది,

"గాస్‌స్టవ్ వెలిగించబోతే చీర అంటుకొని ఒళ్ళుకాలిపోయింది. సమయానికి దొరబాబు యింటి దగ్గర లేడు" మిత్రులు చెప్పారు.

శకుంతల శవ దహనం జరిగిపోయింది తండ్రి సమక్షంలో.

ఆర్నెల్లు తిరక్కుండానే దొరబాబుకి రెండు లక్షల కట్నంతో వచ్చిన కుల వధువుతో అతి వైభవంగా వివాహం జరిగింది.

దొరబాబు ప్రతి యేడూ పేపర్లో 'శకుంతల దివ్య స్మృతి'ని మాత్రం ప్రకటిస్తున్నాడు... శకుంతల నిజంగా గాస్ స్టవ్ ప్రమాదంలోనే చనిపోయిందనే భావం తప్ప మరో అనుమానం ఎవరికీ రాకూడదని...!

○ ○ ○

తిరిగి రాసిన ఈ సగం వినిపించి శాస్త్రితో అన్నాను—

'నీకీ ముగింపు కూడా రుచించదని నాకు తెలుసు, కాని జరుగుతున్న ఈ కథకి యిదే ముగింపు. ఈ కథకి ఆశావహమైన మరో ముగింపు యిచ్చే మంచి కాలం కోసం ఎదురు చూద్దాం-ఆశిద్దాం' అన్నాను. *